క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వరప్రసాద్‌రెడ్డి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎ.వరప్రసాద్‌రెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

నభా కిషోర్‌దాస్ శివైక్యంపై శారదా పీఠాధిపతి విచారం



పీఠంలో ధ్యానం చేస్తున్న నభాకిషోర్‌దాస్, వెనుక స్వరూపానందేంద్ర సరస్వతి(ఫైల్)

సింహాచలం: ఒడిశా ఆరోగ్యశాఖ మంత్రి నభా కిషోర్‌దాస్ కాల్పుల్లో శివైక్యం చెందడం దురదృష్టకరమని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి విచారం వ్యక్తం చేశారు. శనివారం శారదాపీఠం తరఫున స్వామీజీలు ఓ ప్రకటన విడుదల చేశారు. ఒడిశాలో శారదాపీఠానికి ప్రాణప్రదమైన శిష్యుడిగా నభాకిషోర్‌దాస్ ఉండేవారని ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

45 మందికి ఉద్యోగాల కల్పన

సింహాచలం: పెందుర్తి లిటిల్‌ఫ్లవర్స్ హైస్కూల్లో విశాఖలోని అలైన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆఫ్ ఆక్సిజన్ టవర్స్ ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో 45 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు పాఠశాల కరస్పాండెంట్ ఎం.పద్మావతి తెలిపారు. హెచ్‌ఆర్ స్క్వేర్- హానర్ హెట్రో గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌తో పాటు జయభేరి హ్యుండాయ్ కంపెనీల్లో ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ఈజాబ్ మేళా జరిగిందన్నారు.

అనాథ బాలికలకు వస్త్రాలు వితరణ



అనాథ బాలికలకు వస్త్రాలు అంజేస్తున్న బాలభానుమూర్తి

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లోని మనసు అనాథ బాలికల ఆశ్రమంలోని 26 మంది బాలికలకు అడవివరానికి చెందిన సామాజిక కార్యకర్త విజినిగిరి బాలభానుమూర్తి నూతన వస్త్రాలు అందజేశారు. నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

1న దేవస్థానం అనుబంధ ఆలయాల్లో కల్యాణోత్సవాలు

సింహాచలం: వచ్చేనెల 1న భీష్మ ఏకాదశి పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల్లో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో ఒకటో తేదీ రాత్రి 9.30 నుంచి గ్రామ తిరువీధి, అనంతరం కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆ రోజు సాయంత్రం 4గంటల నుంచి గ్రామతిరువీధి, రాత్రి 7గంటలకు కల్యాణోత్సవం , మాధవధారలోని మాధవ స్వామి ఆలయంలో సాయంత్రం 5గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. అదేరోజు రాత్రి 8.30గంటలకు గ్రామతిరువీధి ఉంటుందన్నారు. అలాగే వేణుగోపాల స్వామి ఆలయంలో రాత్రి 7.30గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 9గంటల నుంచి తిరువీధి ఉంటుందని పేర్కొన్నారు. భక్తులంతా ఆయా ఉత్సవాల్లో పాల్గొని తరించాలని కోరారు.

నమో భువనేశ్వరీ..



భువనేశ్వరీదేవికి మంగళస్నానాలు చేయిస్తున్న భక్తులు

- వైభవంగా అధివాసం
- పోటెత్తిన భక్తజనం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఇక్కడ కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆదివారం నిర్వహించిన ఈ ప్రత్యేక అభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. మండలం రోజులకు (41 రోజులకు) ఒకసారి వచ్చే ఆదివారం అధివాసం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ అధివాసం వాకుడు(బృహతి) పత్రితో నిర్వహించారు. ముందుగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి మంగళస్నానాలు చేయించారు. దివ్య పంచామృతాలతో అభిషేకించి, అనంతరం దివ్యాలంకరణ చేసి అర్చనాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు క్యూలో నిరీక్షించి మరీ అమ్మవారికి స్వయంగా పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.



శ్యామా అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీయంత్ర పూజ

దేవీపురంలో ప్రత్యేక పూజలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి శ్రీయంత్ర మహామేరులో గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో శ్రీయంత్ర పూజలు నిర్వహించారు. రాజశ్యామల హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో లండన్ నుంచి వచ్చిన అంతర్మా, యూఎస్‌ఏ నుంచి వచ్చిన జెన్నెట్‌తో పాటు బెంగళూరు,ముంబయ్,త్రివేంద్రం నుంచి పలువురు భక్తులు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శ్యామా నవరాత్రులు చివరి రోజు కావడంతో పలు విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అన్నపూర్ణమ్మ తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సండే సందడి

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరంలో ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. తీరంలో యువతీ యువకులు సెల్ఫీలతో సందడి చేశారు. ఇసుక తిన్నెలపై యువకులు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆటలతో మునిగితేలారు. తీరంలో జలకాలాటలతో సరదాగా గడిపారు.



తీరంలో సముద్ర స్నానాలు చేస్తున్న సందర్శకులు

నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా దాసుబాబు



దాసుబాబు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన మేడిపాటి దాసుబాబు నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక డాక్‌యార్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఇదే..

అధ్యక్షుడిగా మేడపాటి దాసుబాబు, గౌరవ అధ్యక్షుడిగా రొంగలి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా జి.ఎర్రినాయుడు, సోర్నిపూడి సత్యం,కార్యదర్శులుగా గొర్లి దేముడు, సిరిపురపు హరీష్, పైల శ్రీరాములు,ప్రధాన కార్యదర్శిగా జి. అచ్యుతరావు, సహాయ కార్యదర్శిగా జి. చినరాము ఎన్నికయ్యారు.అలాగే కార్యవర్గ సభ్యులుగా పి. అచ్చంనాయుడు,పి. ఈశ్వరరావు,ఆర్. రవి,ఆర్ గణపతి,రమణ ఎన్నికయ్యారు.

బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రకు స్వాగతం

సింహాచలం: బహుజనులకు రాజ్యాధికారం ఇవ్వాలని కోరుతూ బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో పాడేరులో ఈనెల 26న ప్రారంభమైన బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర ఆదివారం పెందుర్తి చేరుకుంది. ఆ బృందానికి విశాఖ జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు బోని కృష్ణ, పెందుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు బంగారి రమణ, కన్వీనర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెందుర్తిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజనులకు రాజ్యాధికారం ఇవ్వాలని ప్రారంభించిన ఈయాత్ర ఫిబ్రవరి 20న అన్నమయ్య జిల్లాలో ముగుస్తుందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు బహుజనులు గెలుస్తారని నాయకులు తెలిపారు. కార్యకమంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి, కోఆర్డినేటర్ లకే రాజారావు, నాయకులు కరణం తిరుపతిరావు, గురే చిన్నారావు, సత్తివాడ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి చేరుకున్న యాత్రికులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రయాణానికి పాట్లు!



ఎన్టీపీసీ వద్ద ధ్వంసమైన రహదారి



శిథిలమైన వెంకటాపురం రహదారి

పరవాడ: మండలంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు ప్రజలు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా పరవాడ- వాడచీపురుపల్లి రహదారిలో ఎన్టీపీసీ ప్లాంట్ వద్ద రోడ్డు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారింది. వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం రహదారి రాళ్లు తేలిపోయి కాలినడక సాగించడానికి కూడా పనికి రాకుండా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇక పరవాడ-సినిమాహాలు కూడలి రోడ్డు గ్రామస్తులను ఇబ్బందుల పాల్జేస్తుంది. సినిమాహాలు-బొట్టవానిపాలెం రోడ్డు, ఎన్టీపీసీ-వెన్నలపాలెం రహదారులు గోతుల మయంగా తయారయ్యాయి. నాయుడుపాలెం శివారు మెట్టపాలెం రహదారి రాళ్ల తేలిపోయి పెచ్చులూడి ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులను అవస్థలకు గురిచేస్తోంది. గోతులమయంగా మారిన రహదారుల కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రయాణికుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని శిథిల రహదారులకు మరమ్మతులు నిర్వహించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాలో రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఆదివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వాగతం పలికారు. ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. - సింహాచలం

లంకెలపాలెంలో వారపు సంత ప్రారంభం



లంకెలపాలెంలో వారపు సంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లో విస్తరించి ఉన్న లంకెలపాలెంలో ఆదివారం సంత (వారపు సంత)ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ఆదివారం ప్రారంభించారు. లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వంతెన దిగువ భాగంలో హైస్కూల్‌కు సమీపంలోని ఖాళీ స్థలంలో ఈ వారపు సంతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ లంకెలపాలెం గ్రామం చుట్టూ లే అవుట్లు అధికంగా ఏర్పాటు కావడంతో వేలాది నిర్మాణాలు చోటు చేసుకున్నాయని, దీంతో జనాభా రెట్టింపు కావడంతో స్థానికంగా కూరగాయలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వారపు సంతను ఏర్పాటు చేయడం శుభ పరిణామన్నారు. స్థానికులకు తక్కువ ధరకు, నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంటాయన్నారు. తరువాత కూరగాయల స్టాళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 86, 79 వార్డుల కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, ఎంఐఎస్ డైరెక్టర్ శీరం నదియా, సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, సుందరపు అప్పారావు, కింతాడ ఈశ్వరరావు, కర్రి నరసింగరావు, యలమర్తి వెంకటరావు, దాసరి తాతారావు, ప్రకాష్, కాతా నూకేష్, హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యదర్శి ఆశాజ్యోతి, నెల్ల కన్నబాబు, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

పాత గాజువాక బస్ స్టేషన్ పరిశీలన

గాజువాక : ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ పాతగాజువాక బస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. నూతనంగా ప్రారంభించిన ఈ స్టేషన్‌లో నిర్వహించాల్సిన కార్యకలాపాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కార్గో పార్శిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. గాజువాక నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పార్శిళ్ల బుకింగ్, వచ్చిన వాటిని ఆయా బుకింగ్‌దారులకు అందజేసేందుకు పాటించాల్సిన మెలకువలను వివరించారు.

వేటూరి పాటలు అజరామరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్

సీతంపేట: తెలుగు భాష ఉన్నంత వరకు వేటూరి పాటలు ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయని విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రఖ్యాత సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సినీ సంగీత దర్శకుడు పాలగుమ్మి రాజగోపాల్ మాట్లాడుతూ 'సినీ కళామతల్లి నుదుట సింధూరం, అలనాటి వాగ్గేయకారులు త్యాగయ్య, అన్నమయ్య, భక్తరామదాసుల ఏక అవతారమే వేటూరి' అని కీర్తించారు. ఈ సందర్భంగా ఝుమ్మంది నాదం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ఆత్రేయ పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని, కొణతాల రాజు, మహమ్మద్ ఖాన్, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎస్.ఎన్.రాజు, టి.రాధారాణి పాల్గొన్నారు.

అలరించిన నృత్య రూపకం .. మెప్పించిన కూచిపూడి నృత్యం



నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు



మాట్లాడుతున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: చినముషిడివాడలో జరుగుతున్న విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కాకినాడకు చెందిన కె.కృష్ణమోహన్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన మోహినీ భస్మాసుర నృత్య రూపకం ఆకట్టుకుంది. కూచిపూడి నృత్య ప్రదర్శన అబ్బురపరిచింది. పలువురు కళాకారులు అన్నమాచార్య కీర్తనలకు నాట్య ప్రదర్శన చేశారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి కార్యక్రమాలను వీక్షించి కళాకారులను ప్రశంసించారు. నవ సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చేలా నృత్య రూపకాలను రూపొందించిన నాట్యాచార్యులు కృష్ణమోహన్‌ను అభినందించారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతం సమర్పిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రవర్తి, అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం అట్టహాసంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



స్వర్ణపుష్పాలు

భయపెడుతున్న గ్రామ సింహాలు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు ప్రజలను భయపెడుతున్నాయి. గ్రామ సింహాల బెడద మరింత పెరిగిపోవడంతో ప్రజలు రోడ్ల మీద తిరగాలంటేనే భయపడిపోతున్నారు. బజారుకు వెళ్తే వీధి కుక్కలు ఎక్కడ మీద పడతాయోనని బయటకు వెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారు. ముఖ్యంగా వాడచీపురుపల్లిలో మాంసం దుకాణాల వద్ద మాటు వేస్తున్న గ్రామ సింహాలు ఇబ్బందిపడుతున్నారు. ప్రమాదం పొంచి ఉండడంతో మాంసం ప్రియులు ఆ దుకాణాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు. నాయుడుపాలెం కూడలి, వాడచీపురుపల్లి బుర్రమామిడి చెట్టు ప్రాంతాల్లో రోడ్ల మీద వీధి కుక్కలు తిష్ట వేస్తుండడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కలు వాహనాల వెంట పరుగులు తీయడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సినిమాహాలు కూడలిలో గుంపులుగా సంచరిస్తున్న గ్రామ సింహాలు

స్టీల్‌ప్లాంట్ కోసం గర్జిద్దాం రండి



జీవీఎంసీ 77వ వార్డు పరిధిలో పాదయాత్ర చేస్తున్న అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

- ఉక్కునగరం త్రిష్టా మైదానంలో నేడే ప్రజా గర్జన

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం నామమాత్రపు ధరకు భూములు ఇస్తే వాటితో కేంద్ర ప్రభుత్వం నేడు వ్యాపారం చేయాలని చూస్తోందని, దీన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అగనంపూడి అఖిలపక్షాల నాయకులు ఇల్లపు ప్రసాద్, నెల్లి శ్రీనివాసరావు, కర్రి దోేంద్రరావు, గవర సోమశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా జీవీఎంసీ 79, 85వ వార్డుల్లోని అగనంపూడి నిర్వాసితకాలనీలు, పరిసర ప్రాంతాల్లో ఉక్కు పరిరక్షణ కమిటీ, నిర్వాసిత ఐక్య వేదిక, అఖిలపక్షాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఉక్కునగరంలోని త్రిష్టా మైదానంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, పదవీ విరమణ పొందిన, మృతి చెందిన కార్మికుల ఖాళీలను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిర్వాసితులకు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిళ్లా కొండలరావు, బలిరెడ్డి సత్యనారాయణ, జె.అయోధ్య రామ్, కరణం పైడిరాజు, పెదిరెడ్ల నీలకంఠం, మోటూరి వెంకటరమణ, వంకర రాము పాల్గొన్నారు.

పెదగంట్యాడ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం ఉక్కునగరంలోని త్రిష్టా మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, సీఐటీయూ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి, పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జంక్షన్ నుంచి నమ్మిదొడ్డి మీదుగా దేవాడ జంక్షన్ వరకూ అఖిల పక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు.